# నవ్వుల తోటలో పువ్వులమంట

"శ్రీరఘువర నీ నగుమోము కనలేని –" అని త్యాగరాజు నగుమోము కోసం వాచిపోలేదా? అంటే మొహం నవ్వుతూ వుండకపోతే ఆ మొహం దేవుడిదైనా సరే చూట్టానికి బావోదని తాత్పర్యం.

నవ్వటం ఇంటికి ఒంటికీ కూడా చాలా మంచిది అంటారు ఫన్ డాక్టర్లు. దుమ్మలగొండి అడవిలో అరుస్తూంటే అచ్చం మనిషి నవ్వినట్లుంటుందిట. ఈ విశాల విశ్వంలో మనిషికి తప్ప మరే జీవికీ నవ్వే గుణమూ, అవకాశమూ లేదు. జంతువులూ మృగాలూ, పక్షులూ అన్నీ ఆడతాయి. పాడతాయి. అరుస్తాయి. కరుస్తాయిగాని నవ్వలేవు. ఆకలి వుంది. దుఃఖం వుంది. భయం వుంది. క్రోధం ఉంది. పగవుంది. కామం వుంది (కోరికలున్నాయి) కాని నవ్వొక్కటే లేదు వాటికి, నవ్వుకి మనిషి పెట్టి పుట్టాడు.

మనవాళ్ళు నవ్వుల్నీ, పువ్వుల్నీ కలిపి నవ్వుల – పువ్వులని అన్నారు. పువ్వులంటే పురుష లెట్లాగవుతారు స్త్రీలే. మాటకిముందు కిసుక్కుమని నవ్వేది స్త్రీలే? నవ్వే ఆడదాన్ని ఏడ్చే మగాడ్ని నమ్మకూడదన్నారు మన ఫూల్స్. ఆడదసలు నవ్వనేకూడదా? మగాడు నవ్వాలి ఆడది ఏడవాలని అందులోని గడుసుతనం. మగాడు నవ్వితే ఏడిచినట్లుంటుంది. నవ్వితే ఆడదే నవ్వాలి. మగాళ్ళకంటే మన ఆడాళ్ళే బాగా నవ్వుతారని నేను ఛాలెంజీచేసి చెప్పగల్ను. మాటకు ముందు నవ్వటం అలాగుంచండి. నవ్వకుండా మాట్లాడలేరు ఆడాళ్ళు. ఏడ్చే మగాడ్ని నమ్మకూడదన్నారు కాని ఆ ఏడుపేదో మనదగ్గర ఏడవ్వద్దంటే సరిపోతుంది కదా! మగాళ్ళు మన్లా నవ్వలేరు. మన్లా ఏడవనూ లేరు. కాని ఏడిపించడానికి తయారవుతారు. ఆడాళ్ళను అయిన్దానికీ, కాన్దానికీ ఏడిపించడం వాళ్ళకోహాబీ.

నవ్వడానికీ నవ్వుకోడానికీ జీవితంలో వున్న అవకాశమ్ము చాలా తక్కువే. నవ్వటం ఒక రిలీఫ్ కాగా – ఏడవటం అంతకంటే పెద్ద రిలీఫ్ అనుకోండి. అందుకే నవ్వేవారి ముందు జారిపడకూడదన్నారు. మన ఏడుపు ఇంకొకరికి నవ్వుకి కారణం కాకూడదదెంత మాత్రం కాకూడదు. నవ్వులో డేంజరుందని పసికట్టిన వాళ్ళు నవ్వు నాలిగందాల చేటన్నారు. లక్ష్మణస్వామి నవ్వుకథ మీ ముసలమ్మల్నడిగి పాడించు కొనండి. లక్ష్మణస్వామి నవ్వు సొంత బ్రదర్కే కోపం తెచ్చింది. అకాలీ రైన్సులాగ అకాలీ లాఫ్టర్ కొంపల్ముంచుతుంది. అనుమానపుపురుషుల ముందు అనసూయలాటి ఆడదికూడా నవ్వకూడదు. నవ్వులో నిప్పులాటి అనుమానం దాక్కొనుంటుంది. ద్రౌపది సుయోధనుడు మయసభలో కాల్జారి నీళ్ళ కొలనులో పడ్డందుకేగా నవ్వింది. ఆ నవ్వు పాండవ కులానికే ముప్పు తెచ్చింది గనుక ఆడది అంతలా విరగబడి షోగ్గా నైసుగా సిల్లీగా నవ్వకూడదు. రూల్సు అలాగ ఏడిశాయి మరి. పబ్లీగ్గా

ఏడవాలిసొస్తుంది. నవ్వు అనేది ఆలోచించి నవ్వాల్సిన విషయమైతే ఏడుపొస్తుంది కాని నవ్వొస్తుందా? నవ్వుకీ, ఆలోచనకి ఆమడదూరం.

నవ్వు పుట్టించే పదార్థాల్లోకల్లా ముఖ్యమైనవి కార్టూనులు. అఫ్ కోర్సు. కార్టూన్ల వెనకే జోకులు. జోకాతురాణాం నభయం న లజ్జా – కార్టూన్లు – జోకులూ వేసే వారికి భయవూ లజ్జా రెండూ వుండవు. మరో నగ్న సత్య మోటిందులో వుంది. అది ఎట్టి దనగా – వ్యాపార ప్రకటనలకు నీతీ, కార్టూన్లకు, జోకులకీ ఎంగిలీ లేదంటారు. ప్రేమికులకు కూడా ఎంగిలి అంటూ అనేవి వుండవనుకోండి. జోకులకు ఆదర్శిప్పు ఓనర్శిప్పూ రెండూ వుండవు. వావీ వరసాకూడా వుండవు.

కొందరంటారుకదా – జోకులూ కార్టూనులు శృతిమించి రాగాన పడకూడదని, శృతి మించనిదే, శోభించవని మరికొందరు యాగీచేస్తారు. జోకుల్నీ కార్టూన్లనూ దీపావళికి బందర్లోలా తూటాలను ఎగస్పార్టీవారు విసిరినవి అవే పుచ్చుకునివిసిరి తిప్పికొట్ట వచ్చును. ఈ తిప్పి కొట్టడంలో చేతిలోనే తుస్సు మనకుండానూ చేతులు కాలకుండాను చూసుకోవాలి.

కార్టూన్లంటే అవి మన జీవితాలమీంచి దూసుకుపోయే వ్యంగ్య రేఖలు. మన గురించి కొన్ని చవకబారు ట్రూత్స్‌ని అవి ముక్కుమీద గుద్దినట్లు నిలేసి చెప్తాయి.

కార్టూన్లు ఏడిపించటం కోసం వేస్తారా నవ్వించటం కోసం వేస్తారా అని కొందరికి అనుమానం. సొసైటీకి కార్టూన్లు మంచి ఒకటో రకం టానిక్స్ లాటివని నా అభిప్రాయం. కోతిమార్కు కిరసనాయిలు బుడ్డి దీపం వెలిగించి, అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేస్తున్నామని కులికేవారికి "జ్ఞాన మొసగరాదా" అని నేను ప్రార్థిస్తాను.

టానిక్స్ చేదుగానూ, పుల్లగానూ, తీపిగానూ, వగరుగానూ మంచి పొగరుగానూ వుండొచ్చు. కార్టూన్లు మిత్రభేదానికీ, మిత్రలాభానికి, సంధి, విగ్రహాదులకు బాగా పనికొస్తాయి. కార్టూనిస్టు కుంచె అది ఒకప్పుడు ప్రమదల చేతిలో ప్రమిదలా చీకట్లను పటాపంచలు చేస్తుంది. ఒకప్పుడది పడుచు ఇల్లాలి ముంతెడు కొప్పులో తురిమిన సన్నజాజి పూల దండలా ఘుమఘుమలాడ్తుంది. విసన కర్రలా సేద తీరుస్తుంది. మంచినీళ్ళ "కూజాలా" చల్లగా బ్రతుకులో తడి ఆర్చుకుపోకుండా కాపాడుతుంది. వ్యంగ్య రేఖలకు ముఖం ముడుచుకునే వారిని కుతకుతమని వుడికిస్తూనే కితకితలు పెట్టి నవ్విస్తుంది. సొసైటీలోని రాస్కెల్సుని స్కౌండ్రల్సుని బిగ్‌యాసులనూ నిర్దాక్షిణ్యంగా కమ్చీ తీసుకుని ఎడాపెడా వాయగొడ్తుంది.

అంచాత మన నరంలేని నాలికను కార్టూనిస్టుల కుంచెమీదకు తిప్పకూడదు. నిజాన్ని తిరగేసి బోర్లేసి నేలమీద బరాబరా యీడ్చుకు రావటం కార్టూనిస్టు జన్మహక్కు. తిట్టు కవిత్వంలాగ, తిట్టే వ్యాసం లాగ, తిట్టు సంగీతం, కార్టూన్లు వుంటాయి.

కార్టూనిస్టు కోసం ఎవరూ వ్యాకరణాలూ, నీతి చంద్రికలూ పదబంధ పారిజాతాలూ రచించనక్కర్లేదు. ఈ మ్యాడ్‌మ్యాడ్‌మ్యాడ్ వరల్డులో ఎవరిక్కావల్సిన నీతి వారు వెతుక్కోగల్రు. నీతులు క్వినైన్మాత్తర్లులాటివి. క్వినైన్మాత్తర్లు కార్టూనిస్టు మ్రింగడు కాక మ్రింగడు. అతగాడికి

లోకమే గురువు. లోకమే తల్లి. లోకమే తండ్రి. గురూ గారు చెప్పినట్లు "ఈ నోకంలో యేటుంది? మంచా – చెడా? కాదు. లాభవూ నష్టవేకద" లాభవొచ్చేపని అతను మాన్డు. నష్టవొచ్చేపని అతను చెయ్డు, దట్సాల్ ఐ టోల్డ్ ది నాస్టీ ట్రూత్!

# హేతువాదం సుబ్బరామయ్య

**మా** హేతువాదం సుబ్బరామయ్య బాబయ్య ముందు, మా చిన వెంకట్రావుడు పిన్ని అచ్చం భీముడి లాగుంటుంది. ఆవిడకు ఇంచక్కా క్రీపు హైర్ తెచ్చి మీసాలు అతికించి చేతిలో ఓ ఇత్తడి గదను పెడితే. ఇండియా కేవిటి చేస్తే అమెరికాకే ప్రెసిడెంటును చేయొచ్చు. (నెన్చెప్పినది మా పిన్ని పర్సనాలిటీ సంగతి). తెలుగులో చాలా మంది ఆడాళ్ళకు రావుడు పేరు మొగాళ్ళకు సీతన్న అనీ వుంటుంది. కాని, భీవుడి పేరు ఎక్కడా ఏ ఆడదానికీ వున్నట్టు నామట్టుకు నాకు తోచదు.

హిడింబాయమ్మగారని భకారావుగారు వాడారుకాని భీమేశ్వరి అని కూడా ఆడకూతుళ్ళకు పేరున్నట్లు ఎక్కడ వెతికినా కనబడదు. కమింగ్ టు ది పాయింట్ – మా చిన వెంకట్రావుడు పిన్ని భీవుడి లాగుంటుందని చెప్పుకున్నా మా సంగీతపు పిచ్చి ఎక్కువ.... ఒకటి రెండు హార్మనీలు రెండు మూడు ఫిడేళ్ళు విరగకొట్టాక వీణదగ్గర స్థిరపడిపోయింది. గాత్రం కూడా యిసుమంత వినసొంపుగానే వుంటుందుంటుందంటారుగాని, ఆవిడ కేసి చూస్తూ, ఆవిడ సంగీతం వింటూంటే సంగీతానికి అపకారం చేసినట్లు ఏదో ఫీలింగు వస్తుంది. చెప్పొద్దూ – ఆవిడ మ్యూజిక్ కాలేజీ ప్రిన్సిపాలయితే సంగీతం మ్యునిసిపాలిటీ పంపుల్లోంచి యింతలావు ధారతో ప్రవహిస్తుంది. అలా చెయ్యగల సామర్థ్యమున్న ఆడకూతురు చిన వెంకట్రావుడు, ది గ్రేట్ వరిజినల్ తెలుగు లేడీ. శ్రీ కృష్ణుడిలా, మన్మథుడిలా, విష్ణుమూర్తిలా, పార్వతీదేవిలాగా నల్లగా వున్నప్పటికీ కళాకాంతులున్న మొహం కనక మొగుడు ఎంత హేతువాదపురుషుడైనా భరిస్తూ వచ్చాడు. చిన వెంకట్రావుడికీ, సుబ్బరామయ్యకీ మధ్యన పచ్చగడ్డివేస్తే భగ్గుమంటుంది. అతను ఎడ్డెం అంటే ఆవిడ తెడ్డెం అంటుంది. కాని అలాగే ఏడెనమండుగురు పిల్లలు ఒకరివెంటొకరు రైలు పెట్టెలలా తోసుకుని పుట్టుకొచ్చారు. ఏవిధంగాచూసినా యిది హేతువాదానికి కట్టుబడని ప్రశ్న.... చిన వెంకట్రావుడు పిన్ని పులిలాగుంటుంది. మా హేతువాదం సుబ్బరామయ్య బాబయ్య మేకలా వుంటాడు. వాళ్ళ సంసారం "పులి – మేకా' ' ఆట. మేక ఎంత హేతువాదాన్ని పురస్కరించుకుని మాట్లాడినా, పులిముందు హేతువాదం పనిచేయ్యదని గుడ్డిముండకు కూడా తెలిసే విషయంకదా – మా చిన వెంకట్రావుడు పిన్ని పిల్లలున్నారు. వాళ్ళు చదువుల్లో ఎలక్ట్రిక్ వైర్స్... ముట్టుకుంటే వాళ్ళ తెలివితేటలకి యివతల